క్లుప్తంగా

మంత్రికి కృతజ్ఞతలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలకు మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేసిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు మాజీ ఎంపీపీ రాణిబాయి రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. మరుగుదొడ్లు సరిగా లేకపోవడతో పాఠశాల బాలికలు ఇబ్బంది పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి నిధులు మంజూరు చేశారన్నారు.

అభినందన



అభినందిస్తున్న ఉపాధ్యాయులు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలం గొల్లబుద్ధారం గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాలలో ఏడో వతరగతి చదువుతున్న విద్యార్థి సౌజన్య ఇటీవల రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ సబ్ జూనియర్ విభాగంలో విజేతగా నిలిచింది. దీంతో శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు మండల రవీందర్ రెడ్డి సౌజన్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ సృజన, ఉపాధ్యాయులు రమేష్, రాణి, యాకూబ్ పాషా, తిరుపతి, శ్రీనివాసరావు, షాహిద్, మల్లికార్జున, మధు, సాంబయ్య, శ్రీనివాస్, కవిత పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

చిట్యాల: మండలంలోని పలు పాఠశాల్లో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మండల అధ్యక్ష కార్యదర్శులు బండి శ్రీనివాస్, సూదం సాంబమూర్తి శుక్రవారం తెలిపారు. మండలంలోని జూకల్, నైన్‌పాక, గోపాలపూర్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మొదటి రోజు విజయవంతంగా కొనసాగించామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న ట్రైనర్ శివ

మల్హర్: మండలంలోని కొయ్యూరు రైతువేదిక కార్యాలయంలో బీఎల్‌ఓలకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్ ఎంపీఎస్‌ఓ శివకృష్ణ మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పారదర్శక ఓటర్ జాబితాలో బీఎల్‌ఓల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఓటర్ జాబితా తయారీలో అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్సై శ్రావణ్‌కుమార్

చిట్యాల: మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన తీగల నాగరాజు ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కానిస్టేబుల్ లాల్‌సింగ్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను గుర్తించి బాధితుడికి శుక్రవారం ఎస్సై శ్రావణ్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు.

వార్డుల వారీగా ఏర్పాటు చేయాలి

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి మున్సిపల్ పరిధిలో వార్డుల వారీగా వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేయాలని శ్రీభక్తాంజనేయ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పొక్కూరి చిన్న రాజయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీలిన గ్రామాలు, వార్డుల్లో కార్యాలయాలు అందుబాటులో లేకపోవడం వలన పలువురు ప్రజలు ప్రభుత్వ పథకాలు అందుకోలేక పోతున్నారని తెలిపారు. ప్రజల సమస్యలను అధికారులు దృష్టికి తీసుకురావడానికి మున్సిపల్ కార్యాలయం మాత్రమే ఉందన్నారు. కార్యాలయానికి రాలేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

- వాతావరణ మార్పులతో జ్వరాలు..
- అప్రమత్తమైన వైద్యారోగ్యశాఖ



మల్లారంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

మల్హర్: వానలు కురుస్తున్నాయి.. వాతావరణంలో వస్తున్న మార్పుల దృష్ట్యా వైరల్ ఫీవర్స్ వచ్చే అవకాశాలు ఉంటాయి. సరైన జాగ్రత్తలు పాటిస్తే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రతీ పది మందిలో నలుగురికి జలుబు, ఇద్దరికి జ్వరంతో కూడిన వైరల్ ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి. వైరల్ జ్వరాలు ఆకస్మాత్తుగా వచ్చి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఒక్కోసారి 102 డిగ్రీల జ్వరం ఉంటుంది. తీవ్రమైన తలనొప్పి, ఒళ్లు నొప్పుల మధ్య నిసత్తువగా మారిపోతారు. కొందరిలో ఒంటిపై దుద్దుర్లు, వాంతులు, అరుదుగా విరేచనాలూ కనిపిస్తాయి. మరికొందరిలో జలుబు వంటి లక్షణాలేవీ లేకుండానే జ్వరాలు వస్తాయి. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, వంటివీ వైరల్ ఫీవర్ కిందకే వస్తాయి.

వైరల్ ఫీవర్ రావడానికి కారణం..

వైరల్ ఫీవర్ గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. కొన్నిసార్లు శ్వాస నాళాల ద్వారా కూడా వ్యాపిస్తుంది. కలుషిత నీరు, ఆహారం తీసుకున్నప్పుడు వైరల్ ఫీవర్ వస్తుంది. పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత తప్పకుండా పాటించాలి.

ఆరోగ్యశాఖ అప్రమత్తం

సీజనల్ వ్యాధులు సోకకుండా మండల వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 3 నుంచి 29 వరకు మెడికల్ క్యాంపుల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. దీంట్లో భాగంగా ఈనెల 3 నుంచి 11 (శుక్రవారం) వరకు రుద్రారం, తాడిచర్ల, కొయ్యూరు, అన్సాన్‌పల్లి, పెద్దతూండ్ల, మల్లారం గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. రోగులను పరీక్షించి, అవసరమైన రోగులకు ఉచితంగా మందులు అందించారు. సిజన్‌ల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా సలహాలు, సూచనలను అందిస్తున్నారు.

ఉచిత వైద్యశిబిరాలు

పలిమెల: పలిమెల, మహదేవ్‌పూర్ మండల పరిధిలోని అంబటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కల్యాణి, ఎమ్ఎల్‌హెచ్‌పీ డాక్టర్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో మండలంలోని మోదేడులో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు జ్వరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డ్రై డే ఫ్రైడే కార్యక్రమాలు, ప్రభుత్వం ద్వారా అందించే వైద్య సదుపాయాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మాసుక్ అలీ, ఏఎన్ఎం శ్రీలత, ఆశ వర్కర్ సమ్మక్క, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండలంలోని కోర్కిశాల గ్రామస్తులకు, మోడల్ స్కూల్, కస్తూరిబాగాంధీ హాస్టల్ లోని విద్యార్థులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి నాగరాణి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాకేశ్, కస్తూరిభాగాంధీ ప్రిన్సిపాల్ శైలజ, హెల్త్ అసిస్టెంట్ భిక్షపతి, ఎన్ఏంలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

అప్రమత్తంగా ఉండాలి..



సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. జ్వరం వస్తే వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. దోమ తెరలను వినియోగించాలి. పూల కుండీలు, ఎయిర్‌కూలర్లు, నీటి గొట్టాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. వేడి పదార్థాలను తీసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగితే మంచిది.

– వినయ్ భాస్కర్, వైద్యాధికారి, మల్హర్

మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

భూపాలపల్లి అర్బన్: ఈ నెల 13, 14న రేగొండ మండల కేంద్రంలోని ఎస్ఎల్ఎన్ గార్డెన్‌లో నిర్వహించనున్న సీపీఐ 5వ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయలో మహాసభ వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. మహాసభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు రామచందర్, సుధాకర్‌రెడ్డి, సోతుకు ప్రవీణ్‌కుమార్, కొరిమి సుగుణ, సతీష్, జోసెఫ్, శ్రీకాంత్, లావణ్య, సంధ్య, లావణ్య, రమేష్ పాల్గొన్నారు.

మల్హర్: భారత కమ్యూనిస్టు పార్టీ 5వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు సోతుకు ప్రవీణ్‌కుమార్ అన్నారు. సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి పన్నాల కుమారస్వామి ఆధ్వర్యంలో మండల కేంద్రం తాడిచర్లలో శుక్రవారం 5వ జిల్లా మహాసభల వాల్‌పోస్టర్‌ను ప్రవీణ్‌కుమార్ ఆవిష్కరించి మాట్లాడారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ 99 వసంతాలను పూర్తి చేసుకున్న భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ జిల్లా మహాసభలను ఈ నెల 13, 14న రేగొండ ఎస్ఎల్ఎన్ గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాస్‌రావు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మహాసభలను ప్రజలు, మేధావులు, కార్మికులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు క్యాతరాజ్ సతీష్, గ్రామశాఖ కార్యదర్శి ఎండీ రహీమ్, మండల శాఖ సహాయ కార్యదర్శి యాషాడపు రాజయ్య పాల్గొన్నారు.



మల్హర్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రేగొండ: మండలంలో ఈ నెల 13న నిర్వహించే సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి శాంతికుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల కార్యదర్శి పెంట రవి, సీనియర్ నాయకుడు సమ్మిరెడ్డి, చంద్రమౌళి, రాజేందర్, ఆగయ్య, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



నరేష్ (ఫైల్)

భూపాలపల్లి రూరల్: పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని బావుసింగ్ పల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బావుసింగ్‌పల్లి గ్రామానికి చెందిన ల్యాదేళ్ల నరేష్(35) ఆర్థిక ఇబ్బందులతో ఈనెల 7న పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం వరంగల్ తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చల్లరాజు తెలిపారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి..

రేగొండ: ఎద్దు దాడి చేసిన ఘటనలో వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కొత్తపల్లిగోరి మండలంలోని చిన్నకోడేపాకలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నకోడేపాక గ్రామానికి చెందిన కనకం వెంకట రాజన్న (60) గురువారం సాయంత్రం వ్యవసాయ పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి చెందిన ఎద్దు దాడి చేసింది. ఈ దాడిలో రాజన్న తీవ్రంగా గాయపడగా కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సోషల్ ఆడిట్ అభ్యంతరాలపై సమావేశం

పలిమెల: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనులు, వనమహోత్సవం, సోషల్ ఆడిట్ అభ్యంతరాలపై అధికారులు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మంజుల, ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. మూడు సంవత్సరాల సామాజిక తనిఖీల్లో వచ్చిన అభ్యంతరాల తొలగింపు కోసం రిప్లై ఇవ్వాలని మండల అధికారులకు సూచించారు. రానున్న వనమహోత్సవం కార్యక్రమంలో ప్లాంటేషన్ కోసం అన్ని ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీఓ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శులు పీటర్ పాల్, శ్రీధర్, వినయ్‌కృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీకాంత్, సాంబశివరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

16న రాష్ట్ర సదస్సు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బ్యాండ్ కళాకారులు

చిట్యాల: కళాకారులందరికీ గుర్తింపు కార్డులు, వృత్తి రక్షణ ఉపాధి కల్పన కోసం ఈనెల 16న హనుమకొండలో నిర్వహించే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని బ్యాండు వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పర్లపెల్లి రవి, కోశాధికారి లద్దునూరి ప్రభు, జాయింట్ సెక్రటరీ భద్రయ్య, అంకుషావళి, బోనగిరి రాజు, వైదనాల మొగిలి, సాయబ్ హూస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో భద్రత



మాట్లాడుతున్న ఎస్సై సుధాకర్

- ఎస్సై సుధాకర్

టేకుమట్ల: గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో భద్రత ఉంటుందని ఎస్సై దాసరి సుధాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు, ఉపయోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక సీసీ కెమెరా 100మంది పోలీసులతో సమానమన్నారు. గ్రామాల్లో ఎదైనా దొంగతనాలు జరిగితే సీసీ ఫుటేజీతో కేసును ఛేదించడం సులభతరం అవుతుందని అన్నారు. ఏఎస్సై దాట్ల కుమారస్వామి, హెడ్ కానిస్టేబుల్ పోషన్న, రాజమౌళి, కానిస్టేబుళ్లు మహేందర్, వెంకటేశ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

మొగుళ్లపల్లి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితతో ఓ వ్యక్తి అక్రమ సంబంధం ఏర్పచుకున్నారు. దీంతో వారు అదే గ్రామంలో ఓ ఇంటిలో కలిసి ఉండడం వివాహిత బంధువులు చూడడంతో వారిపై అక్రమ సంబంధం పెట్టుకున్న వ్యక్తి బెదిరింపులకు దిగాడు. దీంతో అతడిపై పోలీస్ స్టేషన్‌లో వివాహిత బంధువులు శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎడ్లు మృతి



మృతిచెందిన ఎద్దులు

రేగొండ: విద్యుదాఘాతంతో రెండు ఎద్దులు మృతి చెందిన సంఘటన మండలంలోని రేపాకపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన కసుబోజుల ఉపేందర్ ఎద్దులు శుక్రవారం గ్రామ సమీపంలోని చేను వద్దకు మేతకు వెళ్లాయి. ఈక్రమంలో అప్పటికే తెగి పడి ఉన్న విద్యుత్ తీగ తగిలి షాక్ గురై ఎద్దులు మృతి చెందాయి. మృతి చెందిన ఎద్దుల విలువ రూ.లక్షయాభై వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆర్థికంగా ఆదుకోవాలని కోరాడు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

- ఫారెస్ట్ రేంజర్ రాజేశ్వర్‌రావు



మోడల్ స్కూల్ ఆవరణలో మొక్క నాటుతున్న అధికారులు

మల్హర్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కొయ్యూరు ఫారెస్ట్ రేంజర్ రాజేశ్వర్‌రావు, మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ పూర్ణ చందర్‌రావు తెలిపారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్ ఆవరణలో శుక్రవారం అధికారులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సకాలంలో వర్షాలు కురవాలంటే వాతావరణం సమతుల్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. దీంట్లో భాగంగానే ప్రభుత్వం వనమహోత్సవానికి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఇంట్లో ఆరు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ లక్ష్మణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్ట్



అరెస్టు చూపిస్తున్న పోలీసులు

గణపురం: మండలంలోని గాంధీనగర్‌లో గంజాయి తరలిస్తున్న బెడ్డల శ్రీనివాస్ అనే యువకుడిని అరెస్టు చేసి కేజీ గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చిట్యాల సీఐ మల్లేష్, ఎస్సైరేఖ అశోక్‌లు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. శుక్రవారం ఉదయం గణపురం ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు గాంధీనగర్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా యువకుడు అనుమానాస్పదంగా కనిపించడంతో అతని వద్దకు వెళ్లే క్రమంలో పారిపోతుండగా పట్టుకున్నారు. కాగా అతడిని విచారించి మండలం వెంకటేశ్వర్లపల్లికి చెందిన బెడ్డల శ్రీనివాస్‌గా గుర్తించారు. శ్రీనివాస్ హైదరాబాద్‌లో ఒక క్లబ్‌లో కొన్ని రోజులుగా పని చేస్తుండగా అక్కడ మహారాష్ట్రకు చెందిన సల్మాన్ మాజీత్ ఖాన్‌తో పరిచయం ఏర్పడింది. కాగా సల్మాన్ మాజీత్ ఖాన్ వద్ద గంజాయి తీసుకువచ్చిన శ్రీనివాస్ అదే గ్రామానికి చెందిన బాల్య మిత్రుడు ప్రేమ్‌తేజ్ సాయంతో ఇక్కడ గంజాయి విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో గంజాయి తీసుకువచ్చిన శ్రీనివాస్ అతడి మిత్రుడు ప్రేమ్‌తేజ్ కోసం ఎదురు చూస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. కాగా గంజాయిని స్వాధీనం చేసుకోని శ్రీనివాస్‌ను రిమాండ్ తరలించారు. సల్మాన్ మాజీత్ ఖాన్, ప్రేమ్‌తేజ్‌లో పరారిలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం



సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాటారం: కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం చేకూరుతుందని పార్టీ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తూ శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీసీ నాయకులు సంబురాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల్లో భాగంగా కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు 42 శాతం బీసీల రిజర్వేషన్ అమలుకు కేబినెట్ శ్రీకారం చుట్టిందన్నారు. సామాజిక న్యాయంతోనే అభివృద్ధి సాధ్యమని భావించి కాంగ్రెస్ బలహీన వర్గాల హక్కుల సాధన కోసం కృషి చేస్తుందన్నారు. ఎన్ని కుట్రలు పన్నిన కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్ అమలు చేసి తీరుతుందని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు చిటూరి మహేష్, నాయకులు జాడి మహేశ్వరీ, నాయిని శ్రీనివాస్, తెప్పెల దేవేందర్‌రెడ్డి, అంగజాల అశోక్, కొట్టె ప్రభాకర్, నవీన్ రావు, దబ్బెట రాజేశ్, కుంభం రమేశ్‌రెడ్డి, దబ్బెట స్వామి, భూపెల్లి రాజు, అయిత శకుంతల, కుమార్‌యాదవ్, చీర్ల సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తి సంబురాల కళాజాతా



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలో ఇందిర మహిళా శక్తి సంబురాల్లో భాగంగా సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా శక్తి కళాజాతా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల సమైఖ్య ఏపీఎం అంబాల రవివర్మ, కళాకారులు మైస ఎర్రన్న, సెగ్గం శీరీష, సుమలత, రాధిక, ప్రవీణ్, మధుబాబు, శంకర్, రవి, శ్యామల , స్వాతి, స్వప్న, విజయ్‌కుమార్, యాకూబ్, అనిత, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



నోట్‌బుక్స్ అందజేస్తున్న అధికారులు

కాటారం: దీ కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ హై స్కూల్‌లో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. బ్యాంక్ ఖాతా ప్రాముఖ్యత, బ్యాంకింగ్ సేవలను గూర్చి బ్యాంక్ మేనేజర్ హరిరామ్‌నాయక్ విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. బ్యాంక్ ఖాతా కల్గి ఉండటం తప్పనిసరి అని దాని వల్ల అనేక ప్రయోజనాలు పొందవచ్చన్నారు. అనంతరం కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పుట్టిన రోజు పురస్కరించుకొని విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఫీల్డ్ ఆఫీసర్ రాజిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీజీటీ ఉర్దూ, సైన్స్, పీఈటీ పోస్టులను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 15న మైనారిటీ గురుకులంలో దరఖాస్తు అందించాలని సూచించారు. 16న డెమో నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు చెప్పారు.